సాక్షి జగిత్యాల

శుక్రవారం । 5 । జనవరి । 2024



క్యాలెండర్ ఆవిష్కరణ

జగిత్యాల: టీపీటీఎఫ్ రూపొందించిన క్యాలెండర్‌ను కలెక్టర్ యాస్మిన్ బాషా ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు రమేశ్, రాంచంద్రం, రఘుపతి, సత్యప్రకాశ్, గోవర్ధన్ పాల్గొన్నారు.



ఐజీని కలిసిన మాజీ చైర్మన్

జగిత్యాల: పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ రమేశ్‌ను బీర్‌పూర్ లక్ష్మీనృసింహస్వామి ఆలయ మాజీ చైర్మన్ గోనె ప్రదీప్‌రావు హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
26.0/16.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై కనిపిస్తుంది. గాలిలో తేమశాతం అధికంగా ఉంటుంది. పొగమంచు దట్టంగా కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఏపీ సీఎం జగన్‌కు జెడ్పీ చైర్‌పర్సన్ స్వాగతం



జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వసంత

జగిత్యాలజోన్: మాజీ సీఎం కేసీఆర్‌ను పరామర్శించేందుకు ఆయన ఇంటికొచ్చిన ఏపీ సీఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డికి జగిత్యాల జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కేటీఆర్, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్నారు.

బ్రెయిలీని ఆదర్శంగా తీసుకోవాలి

- కలెక్టర్ యాస్మిన్ బాషా



దివ్యాంగులకు జ్ఞాపికలు అందిస్తున్న కలెక్టర్

జగిత్యాల: లూయిస్ బ్రెయిలీని ఆదర్శంగా తీసుకుని ముందడుగు వేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. గురువారం బ్రెయిలీ జయంతిని కలెక్టరేట్‌లో నిర్వహించారు. బ్రెయిలీ జీవితాన్ని దివ్యాంగులు ఆదర్శంగా తీసుకోవాలని, నిరాశ, నిస్పృహలకు లోను కాకుండా అకుంఠిత దీక్షతో లక్ష్యం వైపు పయనించాలని సూచించారు. బ్రెయిలీ విగ్రహ స్థాపనకు చర్యలు చేపడతామన్నారు. అదనపు కలెక్టర్ లత, జిల్లా సంక్షేమ అధికారి ఆడెపు భాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ కమిషనర్లు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కమిషనర్లు

కోరుట్ల: జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల కమిషనర్లు కలెక్టర్‌ను కలెక్టరేట్‌లో కలిశారు. ఆమెకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో కోరుట్ల, రాయికల్, ధర్మపురి, మెట్‌పల్లి కమిషనర్లు టి.రాజేశ్వర్, జి.సంతోష్, రమేశ్, జగదీశ్వర్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు తాటిపల్లి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీఈటీ

మల్యాల: మండలంలోని తాటిపల్లి జెడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నిర్వహించిన ఎస్జీఎఫ్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో అండర్-14 విభాగంలో పాఠశాల విద్యార్థులు కె.వివేక్, కె.జైశాంత్ ప్రతిభ కనబర్చారు. వీరు ఆర్మూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల హెచ్‌ఎం కె.గౌతమకృష్ణారావు, పీఈటీ బీరయ్య తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ఆందోళన



ఆందోళనలో మధ్యాహ్న భోజన కార్మికులు

జగిత్యాలటౌన్: తమకు కనీస వేతనంతోపాటు పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు కలెక్టరేట్ ఎదుట గురువారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నోజు గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థులకు భోజనం అందిస్తున్న కార్మికుల బాధను అర్థం చేసుకోవాలన్నారు. వేతనం ఏడు నెలలుగా చెల్లించలేదని, దీంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు పెంచాలని, కనీస వేతనం రూ.10,500కు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తాడెపు భాగ్యలక్ష్మి, ఎండీ.రజియా, ఇందంపల్లి గంగమల్లు, తోట రాజేశ్వరి, కొత్తపల్లి లక్ష్మి పాల్గొన్నారు.

మెట్‌పల్లిలో రాజ'కీ'యం

- కాంగ్రెస్‌లో చేరనున్న పలువురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు
- చైర్‌పర్సన్‌పై అవిశ్వాసమే లక్ష్యంగా వ్యూహాలు



మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయం

మెట్‌పల్లి: మెట్‌పల్లి బల్దియాలో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు ఆ పార్టీని వీడడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. గులాబీ పార్టీ పెద్దల తీరుపై అసంతృప్తితో ఉన్న వారంతా ఇంతకాలం రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉండడంతో ఎలాంటి వ్యతిరేక చర్యలకూ పాల్పడకుండా మిన్నకుండిపోయారు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పి ఆ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారు. దీనిపై ఇప్పటికే కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుతో వారు చర్చలు జరపగా.. ఆయన గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ఈ మేరకు ఇద్దరు కౌన్సిలర్లతోపాటు, కో–ఆప్షన్ సభ్యుడు, పద్మశాలీ సామాజిక వర్గానికి చెందిన ముఖ్య నేత త్వరలోనే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నట్లు సమాచారం.

పట్టించుకోని గులాబీ పెద్దలు

అసెంబ్లీ ఎన్నికల్లో కోరుట్ల నుంచి బీఆర్‌ఎస్ మరోసారి గెలిచినప్పటికీ.. రాష్ట్రంలో అధికారంలోకి రాకపోవడం ఆ పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం అలుముకుంది. ఈ క్రమంలోనే కొందరు పనుల కోసం.. మరికొందరు పార్టీ పెద్దలపై అసంతృప్తితో కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు చెందిన కొందరు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. రాబోయే రోజుల్లో మెట్‌పల్లి పట్టణంతోపాటు మిగిలిన మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు హస్తం గూటికి చేరనున్నట్లు తెలిసింది. అయినప్పటికీ గులాబీ పెద్దలు వారిని నిలువరించడానికి ఎలాంటి ప్రయత్నాలూ చేయకపోవడం చర్చనీయాంశమైంది. మరోవైపు ఇప్పటికే బీఆర్‌ఎస్‌కు చెందిన ఇబ్రహీంపట్నం ఎంపీపీపై ఆ పార్టీ ఎంపీటీసీలే అవిశ్వాసం నోటీసు ఇచ్చారు. అలాగే మెట్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. మొత్తానికి తొమ్మిదిన్నరేళ్ల పాటు నియోజకవర్గ రాజకీయాలపై పూర్తి స్థాయిలో పెత్తనం చెలాయించిన బీఆర్‌ఎస్ పెద్దలు.. ప్రస్తుతం పార్టీలో జరుగుతున్న పరిణామాలతో ఆందోళన చెందుతున్నారు.

చైర్‌పర్సన్ భర్తతో విభేదాలతోనే..

మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత భర్త సత్యనారాయణతో ఉన్న విభేదాల వల్లనే బీఆర్‌ఎస్‌కు చెందిన ఇద్దరు కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యుడు ఆ పార్టీని వీడుతున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. పాలకవర్గంలో కొందరికి అన్ని విధాలుగా అండగా ఉంటూ సత్యనారాయణ తమను మాత్రం పట్టించుకోవడం లేదని మొదటి నుంచి వారు అసంతృప్తితో ఉన్నారు. ఆయనకు ఎమ్మెల్యేతోపాటు మెజార్టీ కౌన్సిలర్ల మద్దతు ఉండడంతో ఇన్నాళ్లు వారు చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ఎలాంటి చర్యలకూ పాల్పడలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ పెద్దల అండతో చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలనే వ్యూహాలు రచిస్తున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగానే వారు గులాబీ గూటిని వీడాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

జెడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం వద్దు..!

- పార్టీకి వ్యతిరేకంగా పనిచేయొద్దు
- పూర్తికాలం పదవిలో ఉండాల్సిందే..
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- హైదరాబాద్‌లో జెడ్పీటీసీలతో సమావేశం



కేటీఆర్‌తో సమావేశమైన జెడ్పీటీసీలు

జగిత్యాలజోన్: జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతపై అవిశ్వాసం వద్దని, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ వసంతపై అవిశ్వాసం పెట్టాలని ఒకరిద్దరు జెడ్పీటీసీలు అంతర్గతంగా మంతనాలు కొనసాగిస్తున్నారని, ఈ మేరకు రహస్యంగా సమావేశం కూడా అయ్యారని తెల్సింది. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ అప్రమత్తమై జిల్లాలో కొనసాగుతున్న రాజకీయం.. పార్టీ నాయకుల వైఖరి, జెడ్పీటీసీల వ్యూహాలను పార్టీ అధిష్టానానికి విన్నవించారు. వెంటనే రంగంలోకి దిగిన రాష్ట్ర నాయకత్వం జెడ్పీటీసీలందరినీ బుధవారం హుటాహుటిన హైదరాబాద్‌లోని కేటీఆర్ నివాసానికి రప్పించింది. వారితో కేటీఆర్‌తోపాటు ఎమ్మెల్సీ కవిత కూడా సమావేశమయ్యారు. జెడ్పీ చైర్‌పర్సన్ వసంతపై అవిశ్వాసం పెట్టేందుకు ప్రయత్నిస్తున్న వారిపై పార్టీపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని కేటీఆర్ గట్టిగానే హెచ్చరించినట్లు తెలిసింది. పదవికాలం పూర్తయ్యేవరకూ వసంతే జెడ్పీ చైర్‌పర్సన్‌గా కొనసాగుతారని, ఇందులో మరో ఆలోచన పార్టీకి లేదని కేటీఆర్ తేల్చి చెప్పినట్లు సమాచారం. పార్టీ ఆదేశాలు పాటిస్తామని, జెడ్పీ చైర్‌పర్సన్ వసంతకు సహకరిస్తామని జెడ్పీటీసీలు కేటీఆర్‌కు భరోసా ఇచ్చారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, జెడ్పీటీసీలు కె.రామ్మోహన్ రావు, నాగం భూమయ్య, సంగెం మహేశ్, ఎం.మనోహర్ రెడ్డి, సందిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జి.జలేందర్, కె.భారతి, అశ్వినిజాదవ్ ఉన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ వసంత మాట్లాడుతూ తనపై అవిశ్వాస తీర్మానమనే ప్రచారం పూర్తిగా అబద్ధమని, జెడ్పీటీసీలు పార్టీకి, పాలనకు సహకరిస్తున్నారని పేర్కొన్నారు. తమలో ఎలాంటి విభేదాలు లేవని, చిన్నచిన్న విభేదాలుంటే పరిష్కరించుకుంటామని వెల్లడించారు. పార్టీ ఆదేశాలను ప్రతిఒక్కరం పాటించి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ నుంచి బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తామని స్పష్టం చేశారు.

బిల్లుల చెల్లింపులో వెల్లుల్ల రైతులు ఆదర్శం



రైతులతో సమావేశమైన విద్యుత్ అధికారులు

- ఒకేరోజు రూ.4.24 లక్షల బిల్లులు చెల్లింపు
- వ్యవసాయ బిల్లుల వందశాతం చెల్లింపు

మెట్‌పల్లిరూరల్: వ్యవసాయ విద్యుత్ బిల్లులు ఒకే రోజులో వందశాతం చెల్లించి ఆదర్శంగా నిలిచారు మెట్‌పల్లి మండలం వెల్లుల రైతులు. గురువారం ట్రాన్స్‌ఫార్మర్ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ రైతులు సమావేశమై వ్యవసాయ కనెక్షన్ల బిల్లులు చెల్లించాలని నిర్ణయించుకున్నారు. విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో వారు రైతుల వద్దకు వెళ్లారు. మొత్తంగా 1165 వ్యవసాయ సర్వీసులకు సంబంధించిన బిల్లు రూ.4.24లక్షలు చెల్లించారు. తమకు సహకరించిన రైతులకు అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ఈ సత్యనారాయణ మాట్లాడుతూ వ్యవసాయ కస్టమర్ చార్జీల చెల్లింపులో వెల్లుల రైతులు ఆదర్శంగా నిలిచారని, మిగిలిన గ్రామాల రైతులు వెంటనే చెల్లించాలని కోరారు. మెట్‌పల్లి డీఈ తిరుపతి, ఏడీఈ మనోహర్, ఏఈలు నవీన్, అమరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గం

సారంగాపూర్: గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ (711) గౌరవ అధ్యక్షుడిగా బీర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు కె.మేఘశ్యామ్ ఎన్నికయ్యారు. గురువారం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.నర్సయ్య (మెట్‌పల్లి), ప్రధాన కార్యదర్శిగా పి.తిరుపతి (కొడిమ్యాల), కోశాధికారిగా సీహెచ్.నర్సయ్య (కొడిమ్యాల), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మెండు సతీశ్ (బీర్‌పూర్), ఉపాధ్యక్షులుగా కిరణ్ (మెట్‌పల్లి), శ్రీనివాస్ (కోరుట్ల), రాజు (సారంగాపూర్), రాజ మౌళి (రాయికల్), శ్రీనివాస్(మల్యాల), రాంరెడ్డి (ధర్మపురి), లక్ష్మణ్ (గొల్లపల్లి), ప్రమోద్‌కుమార్ (కొడిమ్యాల), ప్రచార కార్యదర్శిగా రాజేందర్ (సారంగాపూర్), సంయుక్త కార్యదర్శులుగా బాల రాజు (గొల్లపల్లి), రవీందర్ (రాయికల్), సుదర్శన్ (మెట్‌పల్లి), మోజోద్దీన్ (కోరుట్ల), ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు (సారంగాపూర్), రాంప్రసాద్, (గొల్లపల్లి), రామోహన్‌రావు (బీర్‌పూర్), సురేశ్ కుమార్ (కథలాపూర్), కార్యదర్శులుగా తిరుపతి (గొల్లపల్లి), రాజేశ్వర్‌రావు (రాయికల్), సంతోష్ (ఇబ్రహీంపట్నం), శ్రీనివాస్ (ధర్మపురి), శ్రీనివాస్ (మల్లాపూర్), స్టేట్ కౌన్సిలర్లుగా రాజేంద్రప్రసాద్ (రాయికల్), మహేశ్ (బీర్‌పూర్), శ్రీనివాస్ (జగిత్యాల), నరేష్ (మల్యాల), ఈసీ మెంబర్స్‌గా శ్రీనివాస్, రాజు(కోరుట్ల), జాకీర్, వెంకటేశ్ (మెట్‌పల్లి), మహేశ్ (మల్లాపూర్), మహిళా కార్యదర్శులుగా రజిత (ధర్మపురి), మహేశ్వరి (మెట్‌పల్లి), రాణి (బీర్‌పూర్), పూర్ణిమ (మల్యాల), రాజ్యలక్ష్మి, సౌజన్య, ప్రతిభ (మెట్‌పల్లి) నియమితులయ్యారు.

అందుబాటులో ఉంటా.. అభివృద్ధి చేస్తా..

- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి
- ప్రజల సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం



గొల్లపల్లి: ప్రజలందరికీ అందుబాటులో ఉంటానని, సమస్యలు పరిష్కరిస్తానని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేశారు. గురువారం 'సాక్షి' నిర్వహించిన ఫోన్ ఇన్‌లో పాల్గొన్నారు. ప్రజల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కొన్నిటికి అక్కడికక్కడే పరిష్కారం చూపారు. సుమారు 41మంది ఫోన్‌ద్వారా తమ సమస్యలను తెలపగా వాటన్నిటినీ పరిశీలిస్తానని వెల్లడించారు.

- ప్రశ్న: దమ్మన్నపేట అంబేద్కర్ విగ్రహం నుంచి పంచాయతీ వరకు రోడ్డు అధ్వానంగా ఉంది..
  – శివ శ్రీనివాస్, దమ్మన్నపేట, గొల్లపల్లి
- ఎమ్మెల్యే: అధికారులతో మాట్లాడి ఎస్టిమేషన్ వేయించి రోడ్డు బాగు చేయిస్తా.
- ప్రశ్న: శెకల్ల మహదేవుని గుట్ట, చిన్నగుట్ట సబ్‌స్టేషన్ వద్ద అక్రమంగా తవ్వకాలు జరుగుతున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదు.
  – ప్రేమ్‌కుమార్, శెకల్ల, బుగ్గారం
- ఎమ్మెల్యే: రెవెన్యూ అధికారులతో మాట్లాడి తవ్వకాలను నిలిపివేయిస్తాను. విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.
- ప్రశ్న: పెగడపల్లి–మల్యాల మీదుగా బస్సు నడిపిస్తారా..? – మహేశ్‌రెడ్డి, పెగడపల్లి
- ఎమ్మెల్యే: బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించేలా వెంటనే చర్యలు తీసుకుంటా.
- ప్రశ్న: మిషన్ భగీరథ నీరు రావడం లేదు..?
  – ప్రేమ్‌కుమార్, బుగ్గారం
- ఎమ్మెల్యే: మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటాం. రోడ్లు మరమ్మతు చేపడుతాం.
- ప్రశ్న: ఇంటి స్థలం ఉంది.. ఆర్థికంగా లేక నిర్మించుకోలేకపోతున్న. సహాయం చేస్తారా..?
  – బత్తిని తిరుపతి, శ్రీరాములపల్లి, గొల్లపల్లి
- ఎమ్మెల్యే: ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోండి. మీ పేరు నమోదు చేసుకుంటున్నాను. తప్పకుండా ఇల్లు వచ్చేలా చర్యలు తీసుకుంటా.
- ప్రశ్న: గొల్లపల్లి–దీకొండ వయా పెగడపల్లి మీదుగా జగిత్యాల వరకు.. నంచర్ల, రాములపల్లి వరకు బస్సు నడపండి
  – సంపత్‌కుమార్, రాఘవపట్నం, గొల్లపల్లి
- ఎమ్మెల్యే: సంబంధిత ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు నడిపేలా చర్యలు తీసుకుంటా.
- ప్రశ్న: ఉపాధి కోసం సౌదీ వెళ్లిన. అక్కడ బిల్డింగ్ పనిచేస్తుండగా కిందపడితే కాళ్లు విరిగాయి. నాకు ఇద్దరు పిల్లలు. బ్యాంక్ రుణం కోసం దరఖాస్తు చేసుకున్నా అందలేదు. రుణంతోపాటు, బ్యాటరీ సైకిల్ ఇప్పించండి.
  – ధర్మేందర్, తుమ్మెనాల, ధర్మపురి
- ఎమ్మెల్యే: ప్రభుత్వం నుంచి రుణం సాయం అందేలా కృషి చేస్తాను. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి రుణం అందేలా చర్యలు తీసుకుంటాను. ట్రైసైకిల్ త్వరలోనే అందజేస్తాం.
- ప్రశ్న: శ్మశాన వాటిక మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. కనీస సౌకర్యాలు లేవు. ధర్మారంలో సంత రోడ్లపైనే నిర్వహిస్తున్నారు.
  – చారి, మేడారం, ధర్మారం
- ఎమ్మెల్యే: శ్మశాన వాటిక, రోడ్ల సమస్యలు పరిష్కరిస్తా. మార్కెట్‌లో సౌకర్యాల కల్పిస్తా.
- ప్రశ్న: లింక్–2లో 2.08 ఎకరాలు ప్రభుత్వం తీసుకుంది. అధికారులకు మొరపెట్టుకున్నా పరిహారం అందలేదు. సమస్యను పరిష్కరించండి.
  – రవి, ల్యాగలమర్రి, పెగడపల్లి
- ఎమ్మెల్యే: లింక్–2 బాధితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపడుతుంది. ల్యాగలమర్రితోపాటు, నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సమస్యలు చాలా ఉన్నాయి. సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తా.
- ప్రశ్న: వర్షకాలం నుంచి దొంతాపూర్‌లో లిఫ్ట్ బంద్ అయింది. వందలాది ఎకరాలు బీడుగా మారింది.– మహేశ్, దొంతాపూర్, ధర్మపురి
- ఎమ్మెల్యే: చెడిపోయిన లిఫ్ట్‌కు మరమ్మతు చేయించి ఎస్సారెస్పీ నీటి విడుదల కాగానే సాగునీరు అందేలా చర్యలు చేపడతాం.
- ప్రశ్న: ఎల్లాపూర్ చెరువుకు కెనాల్ లేదు. చెరువు తూము ద్వారా ముందున్న వారికే సాగునీరు అందుతోంది. డైరెక్ట్ కెనాల్ ఏర్పాటు చేయండి.
  – మల్లేశ్, ఎల్లాపూర్, పెగడపల్లి
- ఎమ్మెల్యే: సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి కెనాల్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు తయారు చేయిస్తాం. రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటా.
- ప్రశ్న: ముక్కట్రావ్‌పేటలో కొంతమందికి ఆర్ఆర్ ప్యాకేజీ అందలేదు. ఇప్పించగలరు.
  – కుమారస్వామి, ముక్కట్రావ్‌పేట, వెల్గటూర్
- ఎమ్మెల్యే: ఈనెల 6న తాళ్లకొత్తపేటలో సమావేశం ఉంది. అక్కడకు వస్తే కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా.
- ప్రశ్న: మల్లన్నపేటలో బ్యాంక్ సౌకర్యం లేదు. లక్ష్మీపూర్ వెళ్తున్నాం. – రాము, మల్లన్నపేట
- ఎమ్మెల్యే: బ్యాంక్ అధికారులతో మాట్లాడి మినీ బ్యాంక్ సేవా కేంద్రం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటా. గొల్లపల్లి–మల్లన్నపేట జాతర పూర్తి కాగానే అధికారులతో ఎస్టిమేషన్ వేయించి రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకుంటా.
- ప్రశ్న: పద్మశాలివాడకట్టులో 10ఏళ్లుగా డ్రెయినేజీ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.
  – సతీశ్, రాపల్లి, గొల్లపల్లి
- ఎమ్మెల్యే: ఎన్నికల పర్యటన సమయంలో గ్రామానికి వచ్చినప్పుడు ఈ విషయం నా దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పుడు మళ్లీ గుర్తుచేశారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి డ్రెయినేజీ సమస్య పరిష్కరిస్తా.

బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

- ఈనెల 31 వరకు ఆపరేషన్ స్మైల్–10
- అదనపు కలెక్టర్ బీఎస్.లత



మాట్లాడుతున్న లత



పాల్గొన్న అధికారులు

జగిత్యాల: బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని, ఈనెల 31 వరకు ఆపరేషన్ స్మైల్–10 నిర్వహిస్తామని అదనపు కలెక్టర్ బీఎస్.లత అన్నారు. గురువారం మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఆపరేషన్ స్మైల్–10 విడతపై సమావేశమయ్యారు. బాల కార్మికులను భిక్షాటన చేసే బాలలు, వీధి బాలలు, తప్పిపోయిన బాలలు, నిరాధరణకు గురైన బాలలను గుర్తించి రిస్క్ చేయడంతోపాటు, వారికి కావాల్సిన సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రతియేటా జనవరిలో ఆపరేషన్ స్మైల్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని రెండు డివిజన్లకు రెండు రిస్క్ టీంలు ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా 14 నుంచి 18 ఏళ్లలోపు బాలలు ప్రమాదకరమైన పనులు చేయించరాదని, ఒకవేళ చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. షాపుల యజమానుల లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. ఎవరైనా బాలలు పనిలో కనిపిస్తే చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ నరేశ్, సీఐ వెంకటేశ్వర్లు, జిల్లా సంక్షేమాధికారి ఆడెపు భాస్కర్, బాలల సంరక్షణ అధికారి హరీశ్, ప్రొటెక్షన్ అధికారి కరుణశ్రీ పాల్గొన్నారు.

పాత కమిటీలతోనే పర్యవేక్షణ

- ఎస్ఎంసీలకు ఆర్నెళ్లు పొడిగింపు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

జిలాలో పాఠశాలల వివరాలు

ప్రాథమిక పాఠశాలలు	: 515
యూపీఎస్‌లు	: 84
హైస్కూల్స్	: 189
కేజీబీవీలు	: 14
మోడల్‌స్కూల్స్	: 13



కుమ్మరిపల్లి ప్రాథమిక పాఠశాల

రాయికల్: పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములై విద్యాభివృద్ధికి పాటు పడుతున్న ఎస్ఎంసీల కాల పరిమితిని ప్రభుత్వం ఆర్నెళ్లు పొడిగించింది. నిబంధనల ప్రకారం ప్రతి రెండేళ్లకోసారి కమిటీలను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఈ కమిటీలకు 2023 నవంబర్ నాటికి రెండేళ్లు పూర్తి కాగా డిసెంబర్ వరకు పొడిగించారు. తాజాగా మరో ఆర్నెళ్లు పొడిగిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

ఎస్ఎంసీలో ప్రధాన భాగస్వాములు వీరే..

తల్లిదండ్రులు పాఠశాల నిర్వహణలో ప్రధాన భాగస్వాములు కావాలనే విద్యాహక్కు చట్టం ఎస్ఎంసీని ఏర్పాటు చేసింది. బడిలో చదివే పిల్లల తల్లిదండ్రులే సభ్యులుగా కొనసాగుతారు. రెండేళ్లు పదవిలో ఉంటారు. సభ్యుడి పిల్లలు పాఠశాలను వదిలి వెళ్లినట్టయితే ఆ సభ్యుడు పదవి కోల్పోతారు.

ప్రత్యేక సమావేశం

కమిటీల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. విధివిధానాలను వివరించి మొదట ప్రతి తరగతి నుంచి ముగ్గురు ప్రతినిధులను ఎన్నుకుంటారు. ఆ తర్వాత మరో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఒకరిని చైర్మన్‌గా.. మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ఎక్కువ మంది పోటీ ఉంటే ప్రతినిధుల అభిప్రాయాలు తీసుకుంటారు. ఈ కమిటీల్లో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, అంగన్వాడీ, ఆరోగ్య కార్యకర్త, మహిళా సమాఖ్య సభ్యురాలికి ప్రాతినిధ్యం కల్పిస్తారు. ఎంపికయ్యే తల్లిదండ్రుల్లో కేటగిరీల వారీగా రిజర్వేషన్లు అమలు చేస్తారు. నాలుగేళ్ల నుంచి ఎస్ఎంసీ ఎన్నికలు లేకపోవడంతో ఆ పాఠశాలల్లో చదివే వారు వేరే బడుల్లోకి.. వెళ్లినా పాతవారే కొనసాగుతున్నారు. దీంతో పరవేక్షణ కరవైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆరునెలల గడువు పొడిగింపు



ఎస్ఎంసీ కమిటీల గడువును మరోసారి ఆరు నెలల పాటు పొడిగిస్తూ విద్యాశాఖ నిర్ణయించింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులు కూడా వెలువడ్డాయి. ఎస్ఎంసీల సహకారంతో పాఠశాలలు అభివృద్ధి చేసుకోవాలి. – జగన్మోహన్‌రెడ్డి, డీఈవో

ఎస్ఎంసీలు బాధ్యతలు

చైర్మన్, వైస్ చైర్మన్‌లు ప్రతిరోజూ విధిగా మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు, యూనిఫాంలు, పాఠ్యపుస్తకాల పంపిణీ వంటి అంశాలను పర్యవేక్షించాలి. మూత్రశాలలు, శుద్ధినీరు, మైదానాలు, క్రీడాసామగ్రి తదితర సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేయాలి. ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలి. నిర్వహణ నిధులు ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్ జాయింట్ ఖాతాలో వేస్తారు. వీటిని సక్రమంగా వినియోగించాల్సి ఉంటుంది.

క్లుప్తంగా

వలసకూలీ ఆత్మహత్య


పాండ్రు మృతదేహం

రుద్రంగి(వేములవాడ): పిల్లలు అయితలేరని, కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన వలసకూలీ బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మ జిల్లా పాండూమ్ గ్రామానికి చెందిన పాండ్రు(38) రుద్రంగి మండల కేంద్రంలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. రోజు మాదిరిగానే పనులు ముగించుకొని వచ్చి ఇంట్లో పడుకున్నాడు. ఉదయం లేచి చూసే సరికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటి యజమాని, స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా శవ పంచనామా చేసి, మేస్త్రీ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు రుద్రంగి పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని స్వస్థలానికి తరలించారు.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య


కుమారస్వామి(ఫైల్)

ఇల్లందకుంట(హుజూరాబాద్): అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పాతర్లపల్లిలో విషాదం నింపింది. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాలు. మండలంలోని పాతర్లపల్లికి నందికొండ కుమారస్వామి(43)కి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు. అప్పు చేసి కూతుళ్లకు వివాహం చేశాడు. అప్పు తీర్చే మార్గం కనిపించక మద్యానికి బానిసయ్యాడు. బుధవారం ఇంట్లో పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జమ్మికుంటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్‌లోని ఎంజీ ఎం ఆస్పత్రికి తరలించారు. గురువారం ఉదయం చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య


వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని కొత్తపల్లికి చెందిన తంగళ్లపల్లి శ్రీనివాస్(53) అనారోగ్య సమస్యలతో గురువారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు. శ్రీనివాస్ మూడేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా, మందులు వాడినా తగ్గడం లేదు. ఖరీదైన వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది పొలం వద్దకు వెళ్లి నీరు లేని బావిలో ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై మహేశ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుని భార్య స్రవంతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శిథిలావస్థలో కాలువలు

- ఎక్కడికక్కడ ఊడిపోతున్న సిమెంట్ లైనింగ్‌లు
- మరమ్మతు చేయాలి.. పంటలకు నీరివ్వాలి

జగిత్యాలఅగ్రికల్చర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా జిల్లాకు సాగునీరు అందుతుంది. అయితే నీరందించే కాలువల పరిస్థితి అధ్వానంగా తయారైంది. వర్షాకాలంలో కురిసిన వర్షాలకు గుట్టలు, వాగుల నుంచి వరద వచ్చి ఎస్సారెస్పీ కాలువల్లో చేరి ఇసుక మేటలు వేశాయి. దీనికితోడు కాలువకు ఇరువైపుల ఉన్న ఎత్తైన చెట్లు ఈదురుగాలులకు కాలువల్లో పడ్డాయి. దీంతో ప్రాజెక్టు నుంచి నీరు వస్తున్నా పంట పొలాలకు వెళ్లడం గగనంగా మారింది.


మోతె వద్ద డి–63 కెనాల్‌లో కూలిపోయిన డ్రాపులు


తిమ్మాపూర్ వద్ద కొట్టుకుపోయిన కెనాల్ సిమెంట్ లైనింగ్

జిల్లాలో 91 కిలోమీటర్ల కాకతీయ కాలువ

జిల్లాలో ఎస్సారెస్పీకి కాకతీయ ప్రధానమైంది. ఇబ్రహీంపట్నం మండలం నుంచి పెగడపల్లి మండలం వరకు 91 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. ఎస్సారెస్పీ నుంచి సాగు నీరు 25 కిలోమీటర్ వద్ద జిల్లాలో ప్రవేశించి.. 116 కిలోమీటర్ వద్ద ముగుస్తుంది. కాకతీయ కాలువకు డి–21 నుంచి డి–83ఏ వరకు 62 డిస్ట్రిబ్యూటరీ కాలువలు ఉన్నాయి. ఒక్కో డిస్ట్రిబ్యూటరీ ఆయకట్టు ఏరియాను బట్టి ఎడమ వైపు 25, కుడి వైపు మరో 25 మైనర్ కాలువలు ఉంటాయి. ఈ మైనర్ కాలువల ద్వారా నీరు పొలాలకు వెళ్తుంది. ఇలా.. జిల్లాలో 1.68 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది. పరోక్షంగా మరో లక్ష ఎకరాల వరకు సాగు నీరు అందుతోంది.

అధ్వానంగా కాలువలు

కాలువలు అధ్వాన స్థితిలో ఉండటంతో ఆ నీరు పొలాలకు చేరడం గగనంగా మారింది. అడపదడపా కాకతీయ ప్రధాన కాల్వకు మరమ్మతు చేస్తున్నా డిస్ట్రిబ్యూటరీ, మైనర్ కాలువల్లో పిచ్చి మొక్కలు పెరిగి.. సిమెంట్ లైనింగ్ ఎక్కడికక్కడే ఊడిపోయి శిథిలావస్థకు చేరాయి. తూములు ధ్వంసమయ్యాయి. డ్రాప్‌లు పగిలిపోయాయి. దీంతో వెల్గటూర్, పెగడపల్లి, ధర్మపురి మండలాలకు సాగునీరు అందడం కష్టంగా మారింది. 2008లో అప్పటి ప్రభుత్వం డిస్ట్రిబ్యూటరీ కాలువకు మరమ్మతు చేయించినా.. తర్వాత అతీగతి లేకుండా పోయింది. దీంతో రైతులు డిస్ట్రిబ్యూటరీ కాలువల్లో రాళ్లు వేసి నీటిని మళ్లిస్తున్నారు. రాయికల్ మండలంలోని చివరి గ్రామం జగన్నాథపూర్, జగిత్యాల రూరల్ మండలం గుట్రాజ్‌పల్లి, బుగ్గారం మండల సిరికొండ, పెగడపల్లి మండలం వెంగళాయిపేట, లింగాపూర్, దోమలకుంట, ఎస్సారెస్పి డిస్ట్రిబ్యూటరీ– 53 రోళ్లవాగు కింద ఉన్న ధర్మపురి మండలం చివరి గ్రామాలకు సాగునీరు అందడం కష్టంగానే మారింది.

అధికారుల పర్యవేక్షణ శూన్యం

ఒకప్పుడు మైనర్ కాలువ నుంచి ఎస్సారెస్పీ వరకు నీటిసంఘాల పాలకవర్గం, చైర్మన్లు ఉండేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో కాలువల పరిస్థితి ఘోరంగా తయారైంది. కాలువ నీటిని సక్రమంగా పంపిణీ చేసేందుకు అధికారులు, లష్కర్లు వంటి క్షేత్రస్థాయి సిబ్బంది కాలువలను పర్యవేక్షించేవారు. ఇప్పుడు సిబ్బంది కొరతతో అధికారులు కాలువల వైపు కన్నెత్తి చూసే పరిస్థితి లేకుండా పోయింది.

నీరు అందుతుందన్న గ్యారంటీ లేదు



ఎస్సారెస్పీ నుంచి సాగు నీరు వస్తున్నా పొలాలకు అందడం లేదు. వ్యవసాయానికి బావులు తవ్వుకుని పంటలు పండిస్తున్నాం. డిస్ట్రిబ్యూటరీ కాలువల లైనింగ్ పడిపోవడం, తూములు మూసుకుపోవడం, పిచ్చి మొక్కలు పెరగడంతో చివరి భూములకు నీరు వచ్చే అవకాశం లేదు.

– వేముల కరుణాకర్ రెడ్డి, ధర్మపురి మండలం

పొలాలకు చేరడం గగనమే



కాలువలకు నీరు వస్తున్నా చివరి గ్రామాలకు సాగు నీరు అందడం లేదు. ఎక్కడికక్కడే కాలువలు దెబ్బతిన్నాయి. చిన్న కాలువలు అయితే కనుమరుగయ్యాయి. కాలువల దుస్థితిని చూసే వారే కరువయ్యారు. ఉపాధి హామి పనులను కాలువల మరమ్మతుకు కేటాయించాలి.

– గణపతి, దొంతాపూర్, ధర్మపురి మండలం

చిట్‌ఫండ్ బాధితులకు వరంగల్ పోలీసుల పిలుపు

జగిత్యాలరూరల్: జిల్లాకేంద్రంలో కొన్నాళ్లపాటు నడిచిన ఓ ప్రైవేటు చిట్‌ఫండ్ కంపెనీ ఇటీవల కార్యాలయాన్ని మూసివేసిన విషయం తెల్సిందే. దీంతో బాధితులు పోలీసులతోపాటు కోర్టును ఆశ్రయించారు. అయితే సదరు చిట్‌ఫండ్ కంపెనీ హెడ్ ఆఫీస్ వరంగల్‌లో ఉండడం.. సదరు యాజమాన్యం కూడా కోర్టును ఆశ్రయించడంతో అక్కడి పోలీసులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో జిల్లాలో కంపెనీ బాధితులు ఎంతమంది ఉన్నారు..? ఎంత పొదుపు చేశారు..? వంటి వివరాలు తెలుసుకునేందుకు ఇక్కడి బాధితులకు వరంగల్ కమిషనరేట్ పోలీసులు సమాచారం అందించారు. దీంతో కంపెనీలో పొదుపు చేసిన వారు గురువారం పెద్ద ఎత్తున వరంగల్‌కు తరలివెళ్లారు.

మొన్న తల్లి.. నేడు తండ్రి మృతి

- పక్షం రోజుల్లో తల్లిదండ్రుల మృతి
- అనాథలు అయిన కూతుళ్లు


తండ్రి శవం వద్ద రోధిస్తున్న కూతుళ్లు

కోనరావుపేట(వేములవాడ): పక్షం రోజుల వ్యవధిలో తల్లి, తండ్రి మృతిచెందడంతో ఇద్దరు కూతుళ్లు అనాథలయ్యారు. నిరుపేద కుటుంబం కావడంతో బంధువుల సహకారంతో అంత్యక్రియలు నిర్వహించారు. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన నేరెళ్ల దేవయ్య–కనకవ్వ దంపతులకు ఇద్దరు కూతుళ్లు గంగ(22), జమున(18). అప్పులు చేసి పెద్దకూతురు గంగ వివాహం చేశారు. తల్లి కనకవ్వ అనారోగ్యానికి గురై డిసెంబర్ 18న మృతిచెందింది. తల్లిమృతితో విషాదంలో ఉన్న ఆ కూతుళ్లకు.. తండ్రి దేవయ్య కూడా అనారోగ్య సమస్యలతో గురువారం మృతిచెందాడు. పదిహేను రోజుల వ్యవధిలో తల్లీదండ్రులు మృతిచెందడంతో వారి వేదనకు అంతులేకుండా పోయింది. చిన్న కూతురు జమున అంత్యక్రియలు నిర్వహించింది.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

- 10 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలు దొంగిలిస్తున్న బోనాల చిరంజీవిని పట్టుకుని గురువారం రిమాండ్‌కు తరలించినటు డీఎస్పీ వెంకటస్వామి తెలిపారు. గతంలో టీఆర్ నగర్‌లో నివాసమున్న చిరంజీవి కొంత కాలంగా మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటకు మకాం మార్చాడు. తరచూ జగిత్యాలకు వచ్చి జిల్లాకేంద్రంలో 9 ద్విచక్రవాహనాలు, గొల్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక వాహనాన్ని చోరీ చేశాడు. గురువారం సాయంత్రం కొత్తబస్టాండ్ వద్ద పట్టణ సీఐ నటేశ్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా చిరంజీవి అనుమానాస్పదంగా కనిపించగా.. పోలీసులు పట్టుకుని విచారణ చేపట్టారు. దీంతో అసలు నిజం వెలుగుచూసింది. చిరంజీవిని అరెస్ట్ చేసి ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఎస్సైలు మన్మథరావు, అబ్దుల్‌రహీం, ఏఎస్సై వెంకటేశ్వర్ రావు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య


కావ్య(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని చీకోడుకు చెందిన యువతి గురువారం అనారోగ్యం భరించలేక ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపిన వివరాలు. చీకోడుకు చెందిన పడిగె కావ్య (19) ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్ద ఉంటుంది. కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న కావ్య ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పొలం పనుల నుంచి తిరిగి వచ్చిన తల్లిదండ్రులకు కావ్య నిర్జీవంగా కనిపించడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు


108 అంబులెన్సులో ప్రథమ చికిత్స చేస్తున్న సిబ్బంది

ధర్మపురి: బైక్ అదుపు తప్పి పడిపోయిన ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం 108లో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మండలంలోని ఆరెపల్లికి చెందిన వికలాంగులు జక్కుల మల్లయ్య, విజయలక్ష్మి గురువారం గ్రామం నుంచి జగిత్యాలకు వెళ్తున్నారు. మార్గంమధ్యలో నేరెల్ల సాంబశివ ఆలయం వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ఘటనలో మల్లయ్య కాలు, చేయి విరిగింది. విజయలక్ష్మి తల, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. స్థానికులు 108అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది చేరుకుని వారిని ఆసుపత్రికి తరలించారు.

బొగ్గుబస్తాలు పట్టివేత

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ నుండి అక్రమంగా తరలిస్తున్న బొగ్గు బస్తాలను సెక్యూరిటీ సిబ్బంది గురువారం పట్టుకున్నారు. ఓసీపీ–5 డంప్‌యార్డు వెనకాల బొగ్గుబస్తాలు నిల్వ ఉన్నాయన్న సమాచారం మేరకు జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఉమేశ్, చంద శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్న బొగ్గును సీఎస్పీకి తరలించారు. అలాగే స్థానిక బాపూజీనగర్‌లో పెన్సింగ్, ఐరన్‌సామగ్రి తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసి ఆటోతో సహా స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. పట్టుకున్న ఆటోను ఈఎం కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఫాంకు రూ.20. జిరాక్సులకు రూ.60


గంగాధరలో అర్జీ పెట్టుకుంటున్న ప్రజలు

- ఆరు గ్యారంటీ పథకాల దరఖాస్తుకు ప్రజలపై భారం
- ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్నా అవగాహన లేక కొనుగోలు

గంగాధర(చొప్పదండి): రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేయడానికి గత నెల 28 నుంచి ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుంటోంది. అయితే, సంబంధిత ఫాంలు ఉచితంగానే ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, అవగాహన లోపమో, ప్రచార లోపమో గానీ ప్రతీ దరఖాస్తుదారు ఫాంలను బయట కొనుగోలు చేస్తున్నారు. ఇందుకు ఫాం కోసం రూ.20, దానికి జతపరిచే జిరాక్సులకు రూ.60 ఖర్చు చేస్తున్నారు. గంగాధర మండలంలోని జిరాక్స్ సెంటర్లు, మీసేవ కేంద్రాల నిర్వాహకులు ప్రజాపాలన దరఖాస్తు ఫాంలకు రూ.15 నుంచి రూ.30 వరకు తీసుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామసభ నిర్వహించడానికి ముందే గ్రామంలో దండోరా వేయించి, ప్రభుత్వం అందజేసిన దరఖాస్తు ఫాంలను ఇవ్వాలని, పథకాలకు అర్జీ పెట్టుకునే విధానంపై అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు. 100 ఇళ్లకు ఒక కౌంటర్ ఏర్పాటు చేసి, దరఖాస్తులు తీసుకోవాలని అంటున్నారు.

ఇవి తెలుసుకోవాలి..

ఇప్పటికే రైతుబంధు పథకం ద్వారా లబ్ధి పొందుతున్న రైతులు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. వ్యవసాయ కూలీలు ఉపాధిహామీ కార్డు నంబర్ ఉంటే ఏటా రూ.12 వేల లబ్ధికి అర్జీ పెట్టుకోవాలి. ఇప్పటికే ఆసరా పథకం ద్వారా పింఛన్ పొందుతున్న వారు చేయూత పథకానికి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. ప్రతీ పథకానికి సంబంధించిన వివరాలకు జిరాక్సులు జత చేయాల్సిన పని లేదు. అభయ హస్తం గ్యారంటీ పథకాల లబ్ధి పొందడానికి ఆధార్ కార్డు, రేషన్‌కార్డు జిరాక్సులు జత చేయడంతోపాటు, ఫాంలోని పథకాల్లో దేనికి అర్హులవుతారో దాని పక్కన టిక్ చేస్తే సరిపోతుంది. వీటిపై ప్రజలకు అవగాహన లేకపోవడంతో కరెంటు బిల్లు, గ్యాస్ బుక్, కుటుంబ సభ్యులందరి ఆధార్‌కార్డు, రైతు భరోసా పథకానికి పట్టాదారు పాసుబుక్కు, వ్యవసాయ కూలీలు ఉపాధికార్డు, ఇంటి నిర్మాణం కోసం ఆర్థికసాయం పొందడానికి భూమి రిజిస్ట్రేషన్ పత్రాలు, బ్యాంకు పాస్‌బుక్కు జిరాక్సులు జత చేస్తున్నారు.

టీఎన్జీవోల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా అఫ్జలుద్దీన్


అభినందిస్తున్న సంఘం కేంద్ర, జిల్లా నేతలు

కరీంనగర్అర్బన్: టీఎన్జీవోల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ అఫ్జలుద్దీన్ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తూ కరీంనగర్ అర్బన్ కార్యదర్శిగా వ్యవహరించారు. ఈ క్రమంలో పోస్టు ఖాళీ నేపథ్యంలో సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణరావు ఏకగ్రీవంగా తీర్మానించారు. 17సంవత్సరాలుగా సంఘానికి విశిష్ట సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేకంగా అఫ్జలుద్దీన్‌ను అభినందించారు. అనంతరం నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులకు, తాలుకా అధ్యక్ష, కార్యదర్శులకు అఫ్జలుద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని నిరసన


వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

కరీంనగర్: పెండింగ్‌లో ఉన్న హాస్టల్ మెస్ బిల్లులను విడుదల చేసి, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మక్కపల్లి పూజ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా సోషల్, బీసీ, మైనార్టీ, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లకు రావాల్సిన బిల్లులను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిల్లులు విడుదల చేయకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్నందున విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయాలని, ప్రభుత్వం వాగ్దానాలతో సర్దిపెట్టకుండా హామీల అమలుకు కృషి చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పారపు రోహిత్, టి.శ్రీజ, నగర ఉపాధ్యక్షుడు శివకుమార్, నాయకులు బోగేశ్ రాకేశ్, నవదీప్, అశోక్, సాయికుమార్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర


అక్షింతలతో ఆర్యవైశ్యులు

మంథని: అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను మంథనిలో గురువారం శోభాయాత్ర నిర్వహించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అక్షింతలను పట్టణంలోని పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అక్షింతలు పంపిణీ చేశారు.